# టక్కు

కాంతమ్మా వెంకటరావూ మేనత్త మేనమామ బిడ్డలు. చిన్నతనములో ఒక చోటే పెరిగారు. అందుచేత వారికి తెగని స్నేహము. కొన్నాళ్ళకు కాంతమ్మ తండ్రి కాలము చేశాడు. ఆయన చనిపోయిన తరువాత కాంతమ్మ తల్లి గుంటూరు చేరింది. పెద్దలు సంపాదించిన ఆస్తితో ఏలాగో ఆమె తన యిద్దరు పిల్లలనూ పోషించుకొంటున్నది. కాని తండ్రి పోయిన కొద్దిరోజులకే తల్లికూడా గతించడముచేత కాంతమ్మ తల్లిలేని పిల్ల అయిపోయింది. తల్లి బతికి వుండగా ఎంత బతిమాలుకొన్నా కాంతమ్మను వెంకటరావుకు ఇవ్వడానికి ఒప్పుకోలేదు. పిల్ల పెద్దదని, ఈడుకాదని పిల్లవాణ్ణి జుట్టుపట్టుకొని ఆడిస్తుందనీ వారి భయము.

అతని ఉద్దేశము ఎలాగున్నా వెంకటరావు చిన్నవాడు.

కాంతమ్మ వివాహము విషయమై బాధ్యత అంతా ఆమె ముత్తవతల్లి మీద పడింది. ఆవిడ యెంత ప్రయత్నము చేసినా మంచి సంబంధము దొరికింది కాదు. కట్నాలు కాలిపోతున్నవి! పిల్లయినా మరీ రంభ కాదు.

“అవునమ్మా! సంబంధాలు మంచివి ఎలా వస్తవి? మొన్న బెజవాడలో జరిగిన పెళ్ళి చూడలేదా? బి.ఏ, చదువుకున్న కుర్రాడికి మూడువేల రూపాయిల కట్నము, వెండి చెంబులు, పట్టు బట్టలూ, వియ్యపురాలికీ, ఆడబడుచులకూ లాంఛనాలకింద రెండు వందలూ యిచ్చారు. ఊరికే మంచి సంబంధం ఎలా వస్తుంది. దారిని పోయే వాడికి ముడివెయ్యండి!” అన్నది ఒక ముసలమ్మ. కాంతమ్మ బుద్ధి తెలిసిన పిల్ల కాబట్టి నొచ్చుకున్నది. ఏమి చేస్తుంది!

ఇలా ఉండగా దసరా పండగలు వచ్చినవి. వెంకటరావు ఇంటికి వచ్చి మళ్ళీ చదువుకు వెళ్ళే ముందు బంధువులయిండ్లన్నీ ఒక మాటు చుట్టబెట్టి రావడము వెంకటరావుకు అలవాటు. అందుచేత గుంటూరు కూడా వచ్చాడు.

వెంకటరావుకూ కాంతమ్మకూ చిన్నప్పటినుంచీ స్నేహమే కాబట్టి ఒకరినొకరు పలకరించుకొన్నారు.

"ఏమే కాంతం, బాగున్నావా?" అన్నాడు వెంకటరావు.

"బాగానే ఉన్నానండీ" అన్నది కాంతమ్మ!

అండీ అనడము వెంకటరావుకు కొత్త చేసింది. కాని వెంటనే చిరునవ్వుతో, "పెద్దదాన వయినా నన్ను అండీ అంటున్నావు!" అన్నాడు.

"మీరు ఎలాగయినా బి.ఏ.లు గదా!"

"బి.ఏ అయితే మటుకు నీకు కొత్త ఏమిటి? వెనుకటివలె ఒరే బావా అను!"

కాంతమ్మ కాస్తసేపు నవ్వుకున్నది.

బావ వచ్చాడని కాంతం ముసలమ్మా కలిసి వేగిరము వంట చేశారు. తల్లి చనిపోయినప్పటి నుంచి ఆమె ముసలమ్మకు వంటలో సహాయము చేస్తూ వుండేది, అందుచేత ప్రత్యేకముగా కంది పచ్చడి జీలకర్రతో నూరి, బంగాళా దుంప కూర ఎత్తుకెత్తూ ఉల్లిపాయలతో వండి కాంతం ముసలమ్మకు తోడుపడ్డది.

వెంకటరావు భోజనానికి కూర్చున్నాడు, ములసమ్మ వడ్డిస్తున్నది. కాంతం ఎదురుగా గడపమీద కూర్చున్నది.

"నాయనా, యిది మీ కాంతం వంట!" అన్నది ముసలమ్మ.

"ఓహెూ, అందుకనే ఇంత బాగున్నది! ఏదీ, ఇంకా కొంచెం కందిపచ్చడి వెయ్యి," అన్నాడు!

తన వంట బావ మెచ్చుకున్నాడు గదా అని కాంతం సంతోషించింది.

"నాయనా, ఎప్పుడు పెళ్ళి చేసుకుంటావోయి?" అన్నది ముసలమ్మ మాటలనడుమ.

"ఏమో తెలియదు. నాన్నగారు నిశ్చయం చెయ్యాలి", అని పరధ్యానంగా అన్నాడు వెంకటరావు.

భోజనము కాగానే వెంకటరావు గదిలో పడక కుర్చీలో కూర్చున్నాడు. కాంతమ్మ తాటియాకెలతో అల్లిన తబుకులో తములపాకుల చుట్టలు పెట్టుకొని గదిలోకి వచ్చింది.

"ఏమిటి కాంతం?" అన్నాడు వెంకటరావు.

"ఏమీ లేదు. తమలపాకులు వేసుకోండి!" అన్నాది కాంతం.

వెంకటరావు ఆ పళ్ళెమందుకొని దానివంక అట్టే చూశాడు.

"ఆ పళ్ళెం నేనల్లిందే" అన్నది కాంతం.

"అలాగా!" అని వెంకటరావు చిరునవ్వు నవ్వినాడు.

ఆ సంగతీ యీ సంగతీ మాట్లాడడములో, "నీ పెళ్ళి యెప్పుడే కాంతం" అన్నాడు. ఆమె తలవంచుకొని మాట్లాడలేదు.

"ఏమిటే అంత సిగ్గు!" అని వెంకటరావు స్వతంత్రముగా చెయ్యిపట్టుకొని ఆమెను దగ్గరకు లాక్కొన్నాడు. కాంతం బిక్కమొగము వేసి, యేడ్చింది. "ఎందుకే యేడుస్తావు?" అని చెయ్యి వదిలినాడు.

కాంతం అతని ముఖమువైపు వింతగా చూసింది. ఆ చూపులు 'చూపులు కావు తూపులు' అని నాటకాలలో వర్ణిస్తారు.

ఎండాకాలము సెలవులలో వెంకటరావు బి.ఏ. అయినట్టు తెలిసింది. అప్పటినుంచి అతని పెళ్ళిమాటలు గట్టిగా ఆలోచనలోకి వచ్చినవి. తండ్రి కొడుకును పిలిచి, "నాయనా, దూపుగుళ్లవారి సంబంధం చూచావు గదా! కట్నం గట్రా బాగానే యిస్తారు. నిశ్చయం చేసుకోమంటావా? వేగిరం చెప్పు," అన్నాడు.

వెంకటరావు ముఖము ముడుచుకొని మాట్లాడలేదు.

"పిల్ల బాగానే వుంటుంది. ఎనిమిదేళ్ళు" అన్నాడు తండ్రి.

కొడుకు మాట్లాడలేదు.

"నేనడిగితే చెప్పలేదు. వాడి యిష్టం ఏమిటో కనుక్కో" అన్నాడు వెంకటరావు తండ్రి అతని తల్లితో.

ఆ రోజే తల్లి కొడుకు దగ్గిరికి వెళ్ళి, "నాయనా, ఈ విషయంలో నీ యిష్టం ఏమిటో చెప్పు, ఒక్కడంటే ఒక్కడివి నీ యిష్టం తర్వాత గదా మా యిష్టం వచ్చిన సంబంధాలలో మంచిది చూసుకుని సరే అను" అన్నది.

వెంకటరావు కొంచెము ఆలోచించి "అమ్మా, నిజం, చెప్పేస్తాను. నాకీ సంబంధాలు ఏవీ యిష్టం కావు!" అన్నాడు.

"మరేమిటి నాయనా!"

"ఏమీ లేదు. మామ కూతురిని చేసుకుంటాను!"

"పెద్ద పెద్ద సంబంధాలు వదిలేసి ఇదేమిటి!"

తల్లి యెన్ని విధాలనో చెప్పింది. ఆఖరుకన్నది "పోనీలే నీ యిష్టం మీ నాన్న యిష్టం!"

అన్న కూతురు తనకు కోడలు కావడము ఇష్టమే. కాని, కట్నం రాదని, ఎలాగయితేనేమి తండ్రి కొడుకుమాట ఒప్పుకొన్నాడు. వివాహము మంగళగిరిలో జరిగినది.

పెళ్ళి అయిన మరుసటి సంవత్సరం కాంతం కాపరానికి వచ్చింది. వెంకటరావుకు గుంటూరులో స్కూలు మేష్టరీ అయింది.

స్వశక్తిచేత మంచి సంబంధము సంపాదించుకొన్నానని కాంతం గర్వపడ్డది. ఆమె చాలా తెలివికలది. ఇంట్లో గడబిడ చేస్తూ వుండేది. వెంకట్రావు వ్రాసుకొంటూ వుంటే హార్మోనియము రొద అతని శాంతికి భంగము కలిగించేది.

ఆయన యేమైనా అంటే దగ్గిరకి వెళ్ళి "బావా!" అని గోలచేసేది. గుమ్మములోకి రెవిక గుడ్డలు అమ్మేవాడు రావడము ఆలస్యము. వెంటనే డబ్బు దండుగ పెట్టి ఏదోఒకటి కొనేది. ఆయన ఏదో వ్రాసుకుంటూ వుంటే వెనకనుంచి వచ్చి కళ్ళు గట్టిగా మూసేది. ఎందుచేతనో వెంకటరావుకు ఇవన్నీ అసహ్యము. తన విషయమై భార్యకున్న నిర్లక్ష్యభావము పోగొట్టవలెనని అతడు కొంచెము బెట్టుగా మాట్లాడుతూ ఉండేవాడు. ఒక్కొక్కసారి రాత్రి యింటికి వచ్చేవాడే కాడు. కాంతమ్మకు కష్టముగా వుండేది.

ఇంతలో ఆమెకు జబ్బు చేసింది. వెంటనే వెంకటరావు భార్యను ఆసుపత్రికి పంపినాడు. తనమీద భర్తకు కోపమున్నట్టు గ్రహించి ఆయనను తిరిగి తన వశము చేసుకొనడమెలాగని ఆలోచించింది. చిన్నతనములో పెళ్ళి కాకమునుపు తానుచేసిన టక్కు ఆమెకు జ్ఞాపకము వచ్చింది.

నాలుగు రోజులకు వెంకటరావు భార్యను చూడడానికి ఆసుపత్రికి వెళ్ళినాడు. భార్య తలనిండా కట్లు కట్టుకొని మంచంమీద పండుకొని వున్నది. ఒంటినిండా

శాలువా కప్పుకొన్నది. కూర్చోమని భర్తకు చేతితో సంజ్ఞచేసి "రోగం బలంగా వుంది. బతకడం కష్టం అంటున్నారు. మీకూ నాకూ ఋణం తీరింది అనుకుంటాను!" అన్నది కాంతమ్మ.

వెంకటరావు మాట్లాడలేదు. కాంతమ్మ క్షీణస్వరముతో, "నేను ఎప్పుడూ గడబిడ చేసేదాన్ని, పూలకనీ, రెవికలకనీ, డబ్బు తీసుకొని మీకు విసుగు పుట్టించేదాన్ని, నాతప్పులన్నీ క్షమించండీ!" అన్నది.

లేనిపోని కాఠిన్యముతో వెంకటరావు, "ఇప్పుడామాటలన్నీ యెందుకులే" అన్నాడు.

"మిమ్మల్ని ఎప్పుడూ హాయిగా వుండనియ్యలేదు! ఏమో కబుర్లతో మీకు మనశ్శాంతి లేకుండా చేసేదాన్ని. బహుశా మిమ్మల్ని నిర్లక్ష్యం కూడా చేసేదాన్నేమో! అన్నీ మరిచి పోండి!" అన్నది కాంతమ్మ.

వెంకటరావు మాట్లాడలేదు.

"నేను బతికినా అందవికారి నయి పోతాను! తలకట్టు రాలిపోయింది. ఇదివరకె అంతంత మాత్రం. చక్కనిదాన్ని కాదని మీరు ముఖం చిట్లించుకొనేవాళ్లు. ఇక నా మీద ప్రేమ ఎలాగుంటుంది!చక్కదనాల పిల్లను ఎక్కడైనా చూసి చేసుకోండి! అని కాంతమ్మ అన్నది. అలా అనగూడదని వెంకటరావు గంట విని వెళ్ళిపోయినాడు.

వెంకటరావు ఇంటికి వెళ్లినాడు. కాని అతనికి ఇల్లు ఇల్లుగా లేదు. ఆఫీసు గదిలో ఆయన ఒక్కడే కూర్చున్నాడు. మేజామీద పెట్టిన పుస్తకాలు పెట్టినట్టే వున్నవి. పూర్వము భార్య అన్ని కదిపివేసి విసుగు పుట్టించేది. ఇంట్లో కలకలధ్వని లేదు, గులాబీపూల వాసనలేదు. మాలతి తీగ నీళ్ళులేక వాడిపోయింది.

సందడిలేని ఆ యింట్లో ఒక్కడే దయ్యములాగ కూర్చున్నాడు. పూర్వము కాంతమ్మకోసము వచ్చే పిల్లల సందడితో ఇల్లు గలగలలాడి పోతూ వుండేది. పెరట్లో బొమ్మల పెళ్ళిళ్ళు జరిగేవి. కందిపప్పు సంతర్పణలు ధారాళముగా జరుగుతూ ఉండేవి. కాంతమ్మ ఆ పెళ్ళిళ్లు నడిపేది. ఆమె సరదావల్ల పిల్లలు చేరుతూ ఉండేవారు. ఇప్పుడా సందడి లేదు.

ఆ సందడి జరిగే రోజులలో వెంకటరావుకు ఆ సరదా తెలియలేదు. ఇప్పుడు వాటికోసము విచారపడ్డాడు. ఇప్పుడు కాంతం వుంటే సంసారములో వుండే సౌఖ్యము వెంకటరావుకు బోధపడ్డది. ఇప్పుడు ఎవరు పూలకు డబ్బివ్వమని బలవంత పెడతారు? ఎవరు జేబులో చెయ్యిపెట్టి స్వతంత్రముగా తీసుకుంటారు?

వెంకటరావు పడకగదిలోకి వెళ్లినాడు. గది బావురుమంటున్నది. “ఇది ప్రాణములేని దేహమువలే వున్నది నా కాంతం వస్తే.....” అనుకొంటున్నాడు.

ఇంతలో వాకిట్లో బండి చప్పుడు అయింది. గుమ్మానికెదురుగా బండి ఆగింది. కాని పరధ్యానములో గమనించలేదు. ఇంతలో పడకగదిలోనుంచి ఆయన బయటికి వచ్చేసరికి కాంతం ప్రత్యక్షమయింది! ఆమె బలహీనముగా ఉన్నది, కాని అదొక కొత్త అందము వచ్చింది.

వెంకటరావు నిర్ఘాంతపోయాడు. కాంతం అని కేకవేశాడు. ఉత్తర క్షణములో వెంకటరావు భార్య రొమ్ముమీద తలవాల్చి వెక్కివెక్కి యేడ్చినాడు. కాంతం పమిటిచెంగు కళ్ళకద్దుకొన్నది.

మరునాడు వెంకటరావు భార్యను చూచి, “కాంతం నీ తలకట్టు ఊడిపోయిం దన్నావు, అందవికారినై పోయినానన్నావు లేదే” అన్నాడు.

“అదంతా టక్కు లెండి బావా!” అన్నది కాంతం.

*(సాహితీ ద్వైమాస పత్రిక, జనవరి 1922)*